క్లుప్తంగా

గాయపడిన మహిళకు అండగా హోంగార్డు



మహిళను జీజీహెచ్‌కు తరలించిన హోంగార్డు నాగరాజు

ఏలూరు టౌన్: ఏలూరు జాతీయ రహదారి సోమవరప్పాడు బ్రిడ్జి వద్ద రోడ్డు ప్రమాదంలో ఒక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. దీనిని గమనించిన రోడ్‌సేఫ్టీ హోంగార్డు నాగరాజు వెంటనే ఆమెను ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. దీంతో ఆ మహిళ ప్రాణాపాయం నుంచి కోలుకున్నట్టు వైద్యులు తెలిపారు. సోమవరప్పాడు గ్రామానికి చెందిన ఎం గీత తన స్కూటీ వాహనంపై ప్రయాణిస్తుండగా అదుపు తప్పి రోడ్డుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆమె తీవ్ర గాయాలై అక్కడే పడి ఉంది. సమీపంలో విధుల్లో ఉన్న హోంగార్డు నాగరాజు ఆమెను రోడ్‌సేఫ్టీ వాహనంలో ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. హోంగార్డు నాగరాజును పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యత



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: పోలీస్ సిబ్బంది సంక్షేమమే లక్ష్యంగా వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్టు ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ తెలిపారు. స్థానిక ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ సిబ్బంది సమస్యలను ఆయన తెలుసుకున్నారు. పోలీస్, ఏఆర్, హోంగార్డుల నుంచి తమ సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించారు. వాటి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు.

యూనియన్ సమావేశం వాయిదా

దెందులూరు: గుంటూరు జిల్లా తాడేపల్లి పీఎస్ఆర్ కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం ఈనెల 13న ఆదివారానికి వాయిదా వేశామని పశ్చిమ గోదావరి జిల్లా మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కలపల సురేష్ కుమార్ అన్నారు. శుక్రవారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో ఆయన మాట్లాడారు.

తమ్మిలేరు లాకులకు లీకులు

- తుప్పుపట్టి పాడైపోయిన పట్టర్లు
- తూర్పు లాకుల వద్ద పేరుకు పోయిన సిల్టు, చెత్త
- పడమర లాకుల వద్ద పాడైన గేటు
- ఆందోళనలో ఏలూరు నగరవాసులు



పడమర లాకులు తుప్పుపట్టిన గేట్ వద్ద వేసిన ఇసుక బస్తాలతో అడ్డుకట్ట



చెత్తా చెదారంతో నిండిన తూర్పు లాకుల ప్రాంతం

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరానికి పడమర వైపు, తూర్పువైపు విస్తరించి ఉన్న తమ్మిలేరు ద్వారా వచ్చే వర్షం, వరద నీరు పూర్తి స్థాయిలో దిగువన కొల్లేరులోకి సాఫీగా వెళ్లేనా అనే ప్రశ్న ప్రజల్లో తలెత్తుతోంది. తూర్పు లాకుల వద్ద పెద్ద మొత్తంలో షిల్ట్, చెత్త పేరుకు పోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా తయారైంది. సీఆర్ఆర్ కాలేజీ సమీపంలో ఉన్న పడమర లాకుల వద్ద కొన్ని చోట్ల గేట్లు పాడైపోయి ఉన్నాయి. పాడైపోయిన స్థానంలో తాత్కాలికంగా ఇసుక బస్తాలు అడ్డువేసి ఉంచారు. పాడైపోయిన గేట్లను బాగుచేసిన దాఖలాలు లేవు. వర్షాకాలం ప్రారంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే రాబోయే రోజుల్లో పెద్దఎత్తున వచ్చే వరద, వర్షం నీరు దిగువన కొల్లేరుకు సాఫీగా వెళ్లేందుకు అవకాశమేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం, జంతు కళేభారాలు వేస్తుండటంతో పాటు తమ్మిలేరు నిర్వహణకు చర్యలు తీసుకోకపోవడం కూడా మరో కారణంగా కనిపిస్తోంది. పెద్ద ఎత్తున గుర్రపు డెక్క, తూడు, చెత్త వంటివి భారీగా పేరుకుపోయాయి. ఈ కారణంగా తమ్మిలేరు ఏటిగట్టు ప్రాంతంలో నివాసం ఉండే ప్రజలు ప్రతినిత్యం దుర్గంధం మధ్యే ఇబ్బందులు పడుతున్నారు. తక్షణం తమ్మిలేరు ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాలని ఏలూరు నగర వాసులు ముక్త కంఠంతో కోరుతున్నారు.

రెండుగా చీలిన తమ్మిలేరు

చింతలపూడి మండల నాగిరెడ్డిగూడెం ప్రాజెక్టు నుంచి ప్రారంభమైన తమ్మిలేరు ఏలూరు వచ్చే సరికి ఏలూరు - చింతలపూడి మార్గంలోని ఏలూరు ఎఫ్‌సీఐ గొడౌన్స్ వద్ద నుంచి తమ్మిలేరు రెండు పాయలుగా చీలుతుంది. ఒకటి తూర్పు వైపున తంగెళ్లమూడి, ఏటిగట్టు, మార్కెట్ యార్డు రోడ్డు, రైల్వే ట్రాక్ దాటుకుని తూర్పు లాకుల వద్ద కొల్లేరులో కలుస్తుంది. మరో చీలిక అశోక్ నగర్, అమీనా పేట, గ్జేవియర్ నగర్ మీదుగా నగరం మధ్య నుంచి కొత్త బస్టాండ్‌కు సమీపంలోని వంతెన దిగువగా ప్రవహించి పడమర లాకుల వద్ద నుంచి కొల్లేరులోకి ప్రవేశిస్తుంది.

నీటి ప్రవాహానికి ఆటంకాలు

తమ్మిలేరు లాకుల నుంచి వర్షాకాలం కొల్లేరులోకి సాఫీగా వరద, వర్షం నీరు పోయేందుకు ఇబ్బందులు తప్పేలా లేవు. వర్షాకాలంలో పెద్ద ఎత్తున వరద నీరు వస్తున్న సమయంలో తమ్మిలేరులోని అన్ని వ్యర్థాలు నీటి ప్రవాహంతో పాటు కొల్లేరులోకి వెళుతూ ఉంటాయి. మిగిలిన రోజుల్లో వేసిన వ్యర్థాలు ఎక్కడివక్కడ పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి. వేసవిలో నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో లాకుల ముఖ ద్వారం వద్ద పెద్ద ఎత్తున మట్టితో కూడిన సిల్టు, చెత్తా, చెదారం పేరుకుపోయి కన్పిస్తున్నాయి. దీంతో వరదల సమయంలో వచ్చేనీరు సాఫీగా కిందకు వెళ్లేందుకు అవకాశం ఉండదనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. చిన్న చిన్న పనులను కూడా ఇరిగేషన్ శాఖ చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిర్వహణపై నిర్లక్ష్యం

తమ్మిలేరును ప్రతి ఏటా సాధారణ నిర్వహణతో పాటు నిత్యం నిర్వహించాల్సిన కార్యక్రమాలు ఎక్కడా కన్పించడం లేదు. దీనికితోడు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు నిర్వహించాల్సిన అవగాహన కార్యక్రమాలు లేవు. అడిగేవారు లేకపోవడంతో కబేళా నిర్వాహకులు, ఫుట్‌పాత్ వ్యాపారాలు, స్థానికులు తమ వ్యర్థాలను తమ్మిలేరులో వేసేస్తున్నారు. వర్షాకాలం మురుగు అంతా దిగువ కొల్లేరులోకి ప్రవహిస్తుందిలే అనుకున్న ఏటిగట్టు వాసులకు లాకుల వద్ద ఎంటువంటి నిర్వహణ కార్యక్రమాలు చేపట్టకపోవడం కొంత ఆందోళన కలిగిస్తుంది.

వైఎస్సార్ సీపీ హయాంలోనే పనులు

తమ్మిలేరు వరదలకు ఏటా ఏలూరు నగరంలోని పలు పల్లపు ప్రాంతాలు నీట మునిగిపోవడం, ప్రజలు నానా అవస్థలు పడుతుండటాన్ని గమనించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తమ్మిలేరు వరద నివారణ చర్యలు చేపట్టింది. తమ్మిలేరుకు పలు చోట్ల రూ.140 కోట్లు వరకు వెచ్చించి రివిట్మెంట్‌లు నిర్మించింది. దీంతో ఏలూరు నగర వాసులకు తమ్మిలేరు వరద ముప్పు తప్పింది. ఇక చేయాల్సిందల్లా ఏటా సాధారణ నిర్వహణ మాత్రమే. దీన్నికూడా ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో తమ్మిలేరు కాలుష్య కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతోంది.

పూడిక తొలగించాలి



తమ్మిలేరు వరద ప్రమాదం నుంచి ఏలూరు నగర ప్రజలను కాపాడాల్సిన బాధ్యత అధికారులపైన ఉంది. వేసవిలో నిర్వహణ కార్యక్రమాలు చేపట్టకుండా వరద నీరు ఉధృతంగా వచ్చే సమయాల్లో హడావుడి చేయడం పరిపాటిగా మారింది. తూర్పు, పడమర లాకుల వద్ద పెద్ద ఎత్తున మట్టి, చెత్త, చెదారం పేరుకుపోయి వరద నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. వీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలి.

– బండి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి, బీకేయంయూ, ఏలూరు

ప్రక్షాళన చేయాలి



తమ్మిలేరును తక్షణం యుద్ధ ప్రాతిపదికన ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. కాలుష్యంతో నిండిపోయి వ్యర్థాలకు నిలయంగా మారిన తమ్మిలేరును పూర్తిగా ప్రక్షాళన చేయాలి. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు చేపట్టాలి. క్రమం తప్పకుండా ఏటా తమ్మిలేరు పూడిక తీయాలి. తద్వారా వర్షాలు సమయంలో అధికంగా వచ్చే నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లేందుకు మార్గం వీలుగా ఉంటుంది.

– ఎండీ ఇస్మాయిల్ షరీఫ్, సామాజిక కార్యకర్త, ఏలూరు

శాకంబరిగా కనకదుర్గమ్మ దర్శనం



శాకంబరి అలంకరణలో దర్శనమిస్తున్న కనకదుర్గమ్మ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక బీడీ కాలనీ చెరువు గట్టుపై నిర్మించిన శ్రీ కనకదుర్గమ్మవారి ఆలయంలో ఆషాఢ మాస పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి శుక్రవారం వివిధ రకాల కాయగూరలతో శాకంబరిగా అలంకరించారు. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు రేఖల చిన్నారావు తదితరులు మాట్లాడుతూ 108 మహిళా భక్తులచే అమ్మవారికి సారె సమర్పించడం చాలా సంతోషకర విషయమన్నారు. సామాజిక కార్యకర్త గొంతిన రామకృష్ణ మాట్లాడుతూ అమ్మవారికి శాకంబరి అలంకరణకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ముసునూరు మత్స్య సొసైటీ ఏర్పాటు చేయాలి



మత్స్యశాఖ డీడీకి వినతి పత్రం అందిస్తున్న ముసునూరు వాసులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా ముసునూరు మండలం ముసునూరు గ్రామంలో ఉన్న దేవర చెరువు, నల్లచెరువు పరిధిలో ఉన్న పేదలతో మత్స్య సొసైటీ ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం కౌలు రైతు సంఘం, సీపీఐ నాయకత్వం మత్స్యశాఖ ఉమ్మడి జిల్లా ఉప సంచాలకులు, అసిస్టెంట్ డైరెక్టర్లకు వినతిపత్రం అందజేశారు. నూజివీడు మత్స్య సొసైటీలో ఉన్న ముసునూరు చెరువులను వేరుచేసి సొసైటీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. 2014 నుంచి ముసునూరుకి సొసైటీ కావాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. దేవర చెరువు, నల్లచెరువుల్లో చేపలు వేసి ఎదిగిన తర్వాత ముసునూరు పేదలే పట్టుకుని జీవిస్తున్నారని తెలిపారు. దేవర చెరువు, నల్లచెరువులను కలిపి మత్స్య సొసైటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ డీడీ, ఏడీలను కోరారు. దీనిపై వారు స్పందిస్తూ ముసునూరు సొసైటీ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య తెలిపారు. కార్యక్రమంలో బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ముసునూరు చెందిన చెంగల వెంకటేశ్వరరావు, సీహెచ్ ఫణి కుమార్, కె.రంగారావు, బదుపుల రవితేజ, కొడవలి కిట్టప్ప తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు

చింతలపూడి: కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేసి, ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు గృహం వద్ద పట్టణ అధ్యక్షుడు కొప్పుల నాగేశ్వరరావు అధ్యక్షతన పట్టణ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో విజయరాజు మాట్లాడుతూ కూటమి వచ్చి ఏడాది పూర్తయినా ఒక్క హామీని నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలను ఇంత వరకు ఎందుకు అమలు చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. మహిళలకు రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా ఉచిత బస్సు అని చెప్పి ఇప్పుడు కేవలం జిల్లాలకే పరిమితం చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా మున్సిపల్ విభాగం అధక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు సీహెచ్ జ్ఞానారెడ్డి, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కె.చండీ ప్రియ, నియోజకవర్గ యూత్‌విభాగం అధక్షుడు ఎం.దిలీప్, శ్రీనివాసరావు, ఎం.ఇమ్మానియేలు, ఎ.సుబ్బారావు, తుమ్మూరి వెంకట్రామిరెడ్డి, గోలి చంద్రశేఖర్‌రెడ్డి, బండారు గోపి, డోకల రాము, ఎండీ రవూఫ్, సొంటి ఖన్నా, ఎస్.దుర్గారావు, మోహన్‌రావు, డి.పేర్రాజు, ఎస్‌డీ హాజీ, ఇక్బాల్, పి.మాధవరెడ్డి, సురేంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రమ దోపిడీ కోసమే మనువాద సిద్ధాంతం

జంగారెడ్డిగూడెం: పీడిత వర్గాల శ్రమ దోపిడీ చేయడం కోసమే కార్పొరేట్ సంస్థలు మనువాద సిద్ధాంతాన్ని ముందుకు తెస్తున్నాయని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు కేవీ రమణ ఆరోపించారు. జంగారెడ్డిగూడెంలో శుక్రవారం కారంచేడు ఘటనలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. రమణ మాట్లాడుతూ జులై 17కి కారంచేడులో దళితులపై జరిగిన దాడికి 40 సంవత్సరాలు పూర్తయిందన్నారు. జులై 11 నుంచి 17 వరకు రాష్ట్ర వ్యాప్తంగా దళిత బహుజనుల్లో స్వీయ గౌరవ ప్రతిఘటనా పోరాట చైతన్యాన్ని పెంపొందించేందుకు సభలు సమావేశాలు నిర్వహించాలని పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు నిచ్చిందన్నారు. ఉప్పాటి దాసు, మద్దిపాటి సత్తయ్య, గంపల వెంకటేష్, కె.రాంబాబు, యడ్లపల్లి మూర్తి, ముప్పిడి నాగేశ్వరరావు, కొత్తూరు చిన్న, తదితరులు పాల్గొన్నారు.

నేటి సాయంత్రం నీటి సరఫరా ఉండదు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక టూ టౌన్ లోని హెడ్ వాటర్ వర్క్స్ సమీపంలో పనుల నిర్వహణ, డిస్ట్రిబ్యూషన్ పంపింగ్ మెయిన్ మరమ్మతులు కారణంగా శనివారం సాయంత్రం నగరంలోని వివిధ ప్రాంతాలు / కాలనీలకు నీటి సరఫరా ఉండదని కమిషనర్ ఎ.భానుప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ఆర్ పేట, నరసింహారావు పేట, కోర్టు, పాలకేంద్రం ఏట్టిగట్టు, లంకపేట ఇజ్రాయల్ పేట, రాణి నగర్, సంతోష్ నగర్, పాములదిబ్బ, బాలయోగి వంతెన ప్రాంతాలు, చేపలతూము సెంటర్‌లలో కుళాయిల ద్వారా నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు. ప్రజలు తగినంత నీటిని నిల్వ చేసుకోవాలని కోరారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలి

కామవరపుకోట: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి ఎం.శ్రీహరి తెలిపారు. కామవరపుకోట పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణ, కొత్తూరులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. తడి, పొడి చెత్తపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికీ వెళ్లి చెత్త సేకరణ చేయాలని, అవసరమైన కొత్త రిక్షాలను కొనుగోలు చేయాలని శ్రీహరి అన్నారు. చెత్త సేకరణ విషయంలో ఐవీఆర్ఎస్ ఫోన్‌కాల్ సర్వేలో సచివాలయ పరిధిలో సిబ్బంది పనితీరు బాగోలేకపోవడంపై పరిశీలన చేసి, సిబ్బందికి సూచనలు జారీ చేశారు. ఎంపీడీవో ఎం.సరళ కుమారి, ఏవో సత్యవేణి, సర్పంచ్ కరిపోతు అనూష, ఉప సర్పంచ్ మేడూరి రంగబాబు, కార్యదర్శి రవి నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

పొల్యూషన్ బోర్డు అధికారుల తనిఖీ

జంగారెడ్డిగూడెం: నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీని పొల్యూషన్ బోర్డు అధికారులు తనిఖీ చేశారు. ఈ నెల 7న పామాయిల్ ఫ్యాక్టరీ నుంచి వెలువడే పొగ, గాలి, నీరు, బాయిలర్ ద్వారా విడుదలయ్యే బూడితతో కాలుష్యం పెరిగి తాము ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని శ్రీనివాసపురం గ్రామస్తులు పొల్యూషన్ బోర్డు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం బోర్డు అధికారి కేవీ రావు పామాయిల్ ఫ్యాక్టరీకి చేరుకొని అనలిస్ట్ తేజస్విని, సిబ్బందితో కలిసి వాటర్ శాంపిల్స్ తీసుకున్నారు. వీటిని పరీక్షించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాన్నారు. ఏపీ కన్స్యూమర్ రైట్స్ చైర్మన్ ప్రసాద్ మాట్లాడుతూ తాము కూడా వాటర్ శాంపిల్స్ పరీక్షించి, రెండు రాష్ట్రాల్లో రిపోర్టులు ఒకేలా రాకపోతే చర్యలు తీసుకుంటామన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	32	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	70
వంకాయలు (కాంతులు)	48	బీన్సచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	48	చామదుంపలు	36
బెండకాయలు	30	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	66	కంద	--
కాకర కాయలు	40-48	బీట్‌రూట్	38
బీరకాయలు	00	కీరా దోస	50
బీరకాయలు (పందిరి)	54	ఫ్రెంచ్‌బీన్స్	100
క్యాబేజీ	24	అల్లం	60
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	46	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	12
గోరుచిక్కుడు	48	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	27
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	38
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	21
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో 22సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	14
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	27
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	28
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	26
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	30
ఏలూరు - తిరుపతి	16.00	4830	22

మహిళలు, బాలికల భద్రతపై అవగాహన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు ఆధ్వర్యంలో శక్తి దళం సభ్యులు ఏలూరు సెయింట్ ఆన్స్ కాలేజీలో మహిళలు, బాలికల భద్రతపై అవగాహన కల్పించారు. శక్తి టోల్ ఫ్రీ నంబర్ 79934 85111ను పరిచయం చేశారు. దీనిని అత్యవసర సమయంలో ఎలా వినియోగించుకోవాలో వివరించారు. సైబర్ నేరాలు, సోషల్ మీడియా మోసాలు, మహిళలపై వేధింపులు, ఆత్మరక్షణ పద్ధతులపై అభయ వాహనం ద్వారా అవగాహన కల్పించారు. కాలేజీల వద్ద బాలికల పట్ల ఆకతాయిలు వేధింపులు గురి చేస్తున్న విషయాన్ని గమనించి శక్తి దళ సభ్యులు ఏలూరు టూ టౌన్‌లో ఇద్దరిని, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఒక వ్యక్తిని అప్పగించి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అత్యవసర సమయాల్లో టోల్ ఫ్రీ నంబర్లు 112, 1930, సైబర్ నేరాల నివారణకు 1098, బాల్య వివాహాల నివారణ, హక్కుల రక్షణకు 95503 51100 వాట్సాప్ హెల్ప్‌లైన్ (అసాంఘిక కార్యకలాపాల నివారణకు) వినియోగించుకోవాలని సూచించారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు

దెందులూరు: చాటపర్రు పశు వైద్యశాల పరిధిలో 2,300 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు ఇచ్చినట్టు పశు వైద్య శాఖ అధికారి డాక్టర్ దివ్య తెలిపారు. శుక్రవారం వైద్యశాలలో ఆమె మాట్లాడుతూ వ్యాధులు రాకుండా ముందస్తుగా నట్టల నివారణ మందులు వాడటం మేకలు, గొర్రెలకు మంచిదన్నారు. వాటికి అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యశాలకు తీసుకురావాలన్నారు.

పరిశుభ్రతతోనే వ్యాధుల నివారణ

దెందులూరు: వ్యక్తిగత పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధులు నివారించొచ్చని గోపన్నపాలెం వైద్యాధికారి డాక్టర్ రోజు మేరీ అన్నారు. శుక్రవారం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియేలు ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన సమావేశం నిర్వహించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వాతావరణం మారినప్పుడు సీజనల్ వ్యాధులు, ఇన్ఫెక్షన్లు డిప్తీరియా, చికున్ ఫాక్స్, రోటా, మలేరియా వ్యాధులు వస్తాయన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నతానియేలు మాట్లాడుతూ పరిశుభ్రతతో అంటువ్యాధులు సంక్రమించకుండా బాధ్యత తీసుకోవాలన్నారు.

కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: మోసపు హామీలు రాజకీయాల్లో ఎక్కువ కాలం ఉండవని వైఎస్సార్ సీపీ దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ దెందులూరు మండల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయినా ఎన్నికల హామీలను అమలు చేయకపోవడాన్ని నిలదీయడంతో ఏంచేయాలో తెలియని దిక్కుతోచని స్థితిలో కూటమి నేతలు ఉన్నారన్నారు. నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి, రైతు సాయం ఇలా ఏ ఒక్కటీ అమలు చేయలేదని ప్రజలు గమనించడమే కాక మోసపోయిన విధానాన్ని ఎండగడుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ అన్ని విభాగాల శ్రేణులు క్షేత్ర స్థాయికి బాబు చేసిన మోసాలను ప్రచారం చేయాలన్నారు. పార్టీ యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు, దెందులూరు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం, రాష్ట్ర కార్యదర్శి తొత్తడి వేదకుమారి, కట్టా ఏసుబాబు, జిల్లా కార్యదర్శి కాటి సుధాకర్, డీబీఆర్‌కే చౌదరి, జిల్లా ఉపాధ్యక్షుడు మేక లక్ష్మణరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎలమర్తి రామకృష్ణ, మండల వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, పోతునూరు గ్రామ సర్పంచ్ బోదుల స్వరూప్, నాయకులు తలారి రామకృష్ణ, బత్రాజు సత్యనారాయణ, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.